

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు(డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (3)*

**అమ్మో, నిన్న! (ఇండియా-జర్మనీ శ్రీమతి ప్రయాణ విశేషాలు - ఆమె మాటల్లోనే)**

మాకు ఎదురుగా కుర్చీల్లో ఓ ముసలి జంట కూర్చుని ఉన్నారు. ఎందుకో మరి - వాళ్లు మమ్మల్నే తదేకంగా చూస్తున్నారు.

కాస్త ఇబ్బందిగా అనిపించి - నేనూ కొద్ది క్షణాలు వాళ్లని తదేకంగా చూశాను. వాళ్లు చలించలేదు. నన్నూ పిల్లల్నీ మార్చి మార్చి చూస్తున్నారు.

వెళ్లి పలకరిద్దామంటే వాళ్లు తెల్లవాళ్లు. మళ్లీ సైగల భాష మొదలెట్టాలి. ఉన్న కాసేపట్లో కొత్త పరిచయాలెందుకులే అనుకుని - నేను నా దృష్టి మరల్చుకున్నాను.

కానీ నేనుండేది కాసేపేనా? ఈ విమానాశ్రయంలో నేను కనీసం ఏడు గంటలు గడపాలి. ఆ తర్వాత విమానం ఎక్కడానికి మళ్లీ మంచులో స్కేటింగు చేసి వెళ్లి మరో విమానమెక్కాలి. అది బెర్లిన్లో దింపితే - అక్కడ మళ్లీ మంచులో స్కేటింగ్ చేసి....

స్కేటింగ్ అనగానే ఇందాకటి చెట్టంకుల్ గుర్తొచ్చాడు. ఆపద్బాంధవులు అన్నివేళలా దొరకరు కదా అనుకోగానే - వళ్లు గగుర్పొడిచింది....

అప్పుడు బాబు నా చేయి గోకాడు. ఏమిట్రా అన్నట్లు చూస్తే కుడి చేతి రెండు వేళ్లు చూపించాడు.

వాడు మామూలుగా తన అవసరాల్ని మాటల్లోనే చెప్పుకుంటాడు నాకు. ఇందాకా సెక్యూరిటీ స్టాఫ్‌తో నా సైగల భాష చూసి వాడికీ మనసు పుట్టిందేమో మరి!

అర్థమైంది - వాణ్ణి బాత్రూంకి తీసుకెళ్లాలి.

వాడితో సమస్య ఏమిటంటే - వాడు పీకెలమీదకి వచ్చేదాకా బాత్రూం విషయం చెప్పడు. ఒకసారి చెప్పాడంటే - మనకి ఎంతో టైమివ్వడు. యాక్సిడెంటు జరక్కుండా నేను తొందర పడాలి. ఐనా యాక్సిడెంటు జరిగిపోతే - ఆ అవస్థ నాదే కానీ వాడు తనకేదో అవమానం జరిగినట్లు ఫీలైపోతాడు. సముదాయించడానికి ఒకోసారి గంటలు చాలవు.

కంగారు పడ్డాను కానీ అదృష్టం బాగుంది. బాత్రూం వెతుక్కుందుకు టైం పట్టలేదు. అది మాకు ఇంచుమించు పక్కనే ఉంది. బొమ్మల్ని చూసి గుర్తు పట్టాను.

మామూలుగా ఐతే వాణ్ణి ఒక్కణ్ణీ తీసుకుని బాత్రూంకి వెళ్లేదాన్ని. కానీ ఇక్కడ అప్పజెప్పడానికి పరిచయస్థులెవ్వరూ లేరు. అందుకని పాపనీ, బ్యాగునీ కూడా తీసుకుని బాత్రూంలోకి వెళ్లాను.

అక్కడ ఇండియన్ మోడల్ టాయిలెట్ లేదు. కానీ విమానంలో కొంత అలవాటు పడ్డాడు కాబట్టి - కమోడ్‌లో వాడి కార్యక్రమం పూర్తయింది. కానీ అక్కడ నీళ్లు లేవు. ఎక్కడా వాష్‌బేసిన్లు కూడా కనబడలేదు. కమోడ్ పక్కన టాయిలెట్ పేపరు ఉంది.

నీటితో ముడిపడ్డ సంస్కృతి మనది. నీటితో పోయేదానికి గొడ్డలితో చెట్టు కొట్టి కాగితాన్ని తయారు చేసే సంస్కృతి ఇక్కడిది. ఆ విషయం నాకు తెలుసు. అదిప్పుడు స్వానుభవంలో పనికొచ్చింది.

వాణ్ణి శుభ్రం చెయ్యడానికి టాయిలెట్ పేపరు వాడాను.

అది పాప చూసింది. వయసు నాలుగే కానీ – దానికి శుభ్రం కాస్త ఎక్కువే. “తుడవడం కాదు. కడుగు. అసహ్యంగా వాసనేస్తుంది” అని నన్ను హెచ్చరించింది.

దాన్ని బాత్రూం బయట నిలబెట్టి తలుపులు మూసి – కడిగినట్లు అబద్ధం చెబుదామని ముందు అనుకున్నాను. కానీ మాకింకా బోలెడు ప్రయాణముంది. ఎన్నిసార్లని అబద్ధం చెప్పగలను? ఎప్పుడో దొరికిపోవడంకంటే – ఇప్పుడు నిజం చెప్పడమే మంచిదనుకున్నాను.

దానికి అర్థం కావాలిగా, అందుకని, “చెట్టంకుల్ దగ్గర నీకు వాసనేసిందా?” అన్నాను.

పాప బుర్ర అడ్డంగా తిప్పింది.

“చెట్టంకుల్ కూడా నీళ్లు వాడరు. ఈ పేపరే వాడతారు. ఆయనే కాదు, ఈ దేశాల్లో వాళ్లందరూ ఈ పేపరే వాడతారు. ఇది నీళ్లకంటే గొప్పగా పనిచేసే స్పెషల్ పేపర్” అని చెప్పాను.

అప్పటికి అది తృప్తి పడినట్లే ఉంది.

మేము బాత్రూంలోంచి బయటపడి మళ్లీ ఇందాకటి చోటికి వచ్చాం. ఆ ముసలి జంట ఇంకా అక్కడే ఉన్నారు. మేము వచ్చేదాకా బాత్రూం కేసే చూసినట్లున్నారు. ఇప్పుడు మళ్లీ మమ్మల్నే చూస్తున్నారు.

పిల్లలతో సహా కుర్చీల్లో స్థిరపడ్డాక – బాబు నా చేతిని గోకి తన చేతిని నోటిదాకా తీసుకెళ్లి ఓ సైగ చేశాడు. వాడికి ఆకలేస్తోందని అర్థమైంది.

హ్యాండ్‌బ్యాగులో ఆపిల్సున్నాయి. సెక్యూరిటీవాళ్లు దయతో విడిచిపెట్టిన చాకు ఉంది. నేను ఆపిల్సు కోసి పిల్లలకి పెడుతూ మధ్య మధ్య ఆ జంటనే గమనిస్తున్నాను.

ఈసారి వాళ్లు మధ్య మధ్య మొహమాటానికి అటూఇటూ చూస్తున్నారు కానీ, వాళ్ల దృష్టి మాత్రం ఎక్కువగా మన పిల్లలమీదే ఉంది. అలా చూస్తూ అప్పుడప్పుడు ఏదో మాట్లాడుకుంటూ కళ్లొత్తుకుంటున్నారు.

అప్పుడు నాకు వాళ్లమీద జాలేసింది. వాళ్ల వెనుక ఏదో కథ ఉందనీ, అది తెలుసుకోవాలనీ అనిపించింది. కానీ ఎలా?

పలకరిస్తే వాళ్లు ఏదో మాట్లాడతారు. అది ఏ రష్యనో, జర్మనో అయితే నాకేమర్థమౌతుంది? ఒకవేళ ఇంగ్లీషులో మాట్లాడినా కూడా – నా వెంకటేశం ప్రతిభ అక్కడ సరిపోదు.

వాళ్ల కథలో మన పిల్లల వయసువాళ్లు ఎవరో ఉండి ఉంటారు. వాళ్లకో వాళ్ల తలిదండ్రులకో ఏదో అయింది. ఏమయిందో మరి!

నా ఊహాప్రపంచంలో వాళ్ల చుట్టూ రకరకాల కథలు అల్లుకుంటున్నాయి. ఒకదానికీ ఒకదానికీ పొంతనలేదు. కానీ ఆ సమయంలో అదీ ఓ కాలక్షేపమే!

నా ఉబుసుపోకకి భంగం కలిగించడానికన్నట్లు – కాసేపటికి వాళ్లు వెళ్లిపోయారు.

పనుల్లో ఉన్నా, ఆలోచనల్లో ఉన్నా సమయం తెలియదు. ఏ పనీ లేకుండా కూర్చుని – కబుర్లాడుకుందుకు సాటివారు లేకుండా ఒంటరితనం అనుభవిస్తున్నప్పుడు – క్షణాలు యుగాలౌతాయి. ఆ రోజు విమానాశ్రయంలో రాబోయే విమానంకోసం గంటలతరబడి ఎదురు చూశానే – అలాంటి శిక్షని మళ్లీ కోరుకోను. ఎందుకంటే – విమానంకోసం వేచి ఉండడంతో పాటు – ఎప్పుడెప్పుడు మిమ్మల్ని కలుసుకుంటానా అన్న తహతహ ఒకటి.

దేశం కాని దేశంలో అపరిచితుల మధ్య ఒంటరిగా ఉన్నప్పుడు గడిపిన ఆ కొన్ని గంటలూ – నాకు సంబంధించి చాలా చాలా పెద్ద శిక్ష!

గంటలు భారంగా గడుస్తున్నాయి. నాకేమో – మాస్కోలో ఎక్కాల్సిన విమానం ఎక్కడానికి ఎక్కడికి వెళ్లాలో తెలియదు. అప్పుడే అడిగితే ఇంకా చాలా టైముందని విసుక్కుంటారని కాసేపు ఊరుకున్నాను.

మా తదుపరి ప్రయాణం ఇక మూడు గంటల్లోకి వచ్చిందనగానే – నాలో వేడి పుట్టింది. అప్పటికి చాలా సేపట్నించే అక్కడున్నానేమో – విమానాశ్రయానికి సంబంధించిన కొన్ని విశేషాలు ఆకళింపుకి వచ్చాయి. యూనిఫాంని బట్టి విమానాశ్రయం ఉద్యోగుల్ని గుర్తించడం మనసులోనే కాసేపు ప్రాక్టీసు చేశాను. ఆ ధైర్యంతో ఆ స్టాఫ్‌లో ఒకామె నా దగ్గరకు వచ్చినప్పుడు చిరునవ్వుతో పలకరించాను.

ఆమె చిరునవ్వుతోనే బదులిచ్చి ఏమైనా సాయం కావాలా అన్నట్లు చూస్తూ ఆగింది.

నేనిక జాప్యం చెయ్యలేదు. ఆమెకు బెర్లిన్ వెళ్లే విమానం నంబరు చెప్పాను. నా వెంకటేశం ఇంగ్లీషులో – ఎక్కడ ఎక్కాలని కూడా అడిగేశాను.

ఆమె నన్ను ఎగాదిగా చూసి, “ఇంగ్లీష్!” అంది.

మన దేశంలోనే కాదు – ఇంగ్లీషు మాట్లాడేవాళ్లంటే ప్రపంచమంతా ఓ ప్రత్యేక గౌరవం కాబోలు. ఆమె చూపుల్లో అది కనిపించింది.

తలూపాను.

ఆమె నన్ను మెప్పుకోలుగా చూస్తూ – ఇప్పుడే వస్తానన్నట్లు సైగ చేసి వెళ్లిపోబోయింది.

ఆమె సైగ అర్థమైంది. కానీ మళ్లీ వస్తుందా లేక నియోగిలా మాయమైపోతుందా అన్న అనుమానంతో – “ప్లీజ్! వన్ మినిట్” అన్నాను.

ఏమనుకుందో ఆమె ఒక్క క్షణం ఆగింది. నేనేదో చెప్పేలోగా, తనని తాను చూపించుకుని, “డోంట్ నో ఇంగ్లీష్. ఐ బ్రింగ్ సంబడీ నోయింగ్ ఇంగ్లీష్” అంది. ఇంగ్లీషు రాని తను నాతో ఇంగ్లీషు మాట్లాడ్డానికి సిగ్గు పడుతోందని నాకు అర్థమైంది.

నా మటుక్కు నాకైతే – అట్టే ఇంగ్లీషు రానివాళ్లతో మాట్లాడ్డమే ఎక్కువ వీలు. ఆ విషయం చెబుదామన్నా మళ్లీ భాష సమస్య!

ఆమె నన్ను తప్పించుకుని పారిపోయిందా అని అనుమానించాను కానీ – ఓ పావుగంటలో తనలాగే యూనిఫాం వేసుకున్న మరొకామెని తీసుకొచ్చి నాకు అప్పగించి వెళ్లిపోయింది.

ఈమె నా వంక బిడియంగా చూస్తూ – నెమ్మదిగా తడుముకుంటూ కొన్ని ఇంగ్లీషు వాక్యాలు పలికింది.

చిన్నప్పుడు తెలుగు మీడియం హైస్కూల్లో నేనూ, నా క్లాస్‌మేట్సూ ఇంగ్లీషు పాఠాలు ఎలా చదివేవాళ్లమో, అలా ఉన్నాయి ఆమె మాటలు. పాపం ఆ విషయం ఆమె దాచుకుందుకు కూడా ప్రయత్నించలేదు. నిజాయితీగా తన గురించి చెప్పుకుంది.

ఇందాకటి అమ్మాయికి తనకి ఇంగ్లీషు రాదని చెప్పడం వరకూ మాత్రమే వచ్చునట. తనకి కూడా పెద్దగా ఇంగ్లీషు రాదుట. ఏదో తడుముకుంటూ మాట్లాడుతుందిట. మీ ఇండియన్సు అందరికీ ఇంగ్లీషు చాలా బాగా వస్తుందని మెచ్చుకుంది. తన పరిమిత భాషా పరిజ్ఞానానికి సద్దుకుపొమ్మని కోరింది.

తెల్లవాళ్లందరికీ ఇంగ్లీషు బాగా వస్తుందన్న దురభిప్రాయం నాకుండేది. తెల్లవాళ్లలోనూ బహుభాషల వాళ్లున్నారనీ, వాళ్లలో మాతృభాష ఆంగ్లం అయినవాళ్లు కొద్దిమంది మాత్రమేననీ నేనప్పుడు తెలుసుకోగలిగాను.

ఇప్పుడామె నా ఇంగ్లీషు వింటే – ఇండియన్సు అందరికీ ఇంగ్లీషు రాదన్న విషయం అర్థమౌతుందని అనుకున్నాను. కానీ మేమిద్దరం మాట్లాడుకుంటున్నప్పుడు ఆశ్చర్యంగా నేనో వెలుగు వెలిగాను. 'మై ఇంగ్లీషు ఈజ్ ది బెస్ట్' అని నేనే అనుకునేలా జరిగింది మా మధ్య సంభాషణ.

ఇద్దరూ ఇంగ్లీషులో మాట్లాడుతూ ఒకరి భాషనొకరు అర్థం చేసేసుకున్నాక – ఆవిడ నా బ్యాగు తీసుకుని తన భుజానికి తగిలించుకుంది. చెయ్యిమ్మని పాపనీ, బాబునీ అడిగింది.

పాప నాకేసి చూసింది. నేను ఫరవాలేదని అన్నాక మేకపోతు గాంభీర్యంతో ఆమెకి తన చెయ్యిచ్చింది.

బాబు మాత్రం ఆమెనోసారి భయంభయంగా చూసి నా కొంగు చాటుకి వచ్చేశాడు. వాడి చెయ్యి నేను పట్టుకున్నాను. కానీ వాడి కళ్లు చూడగానే నాకు అనిపించింది – అక్క చెయ్యి ఆ అపరిచిత పట్టుకోవడం వాడికి నచ్చలేదని.

ఆమె పిల్లలిద్దర్నీ ఓసారి ముచ్చటగా చూసి, నావైపు చూసి నవ్వి, "ఫాలో మి!" అని ముందడుగు వేసింది.

నేను బాబు చెయ్యి పట్టుకుని ఆమెని అనుసరించాను. పాప మధ్యమధ్య వెనక్కి తిరిగి బెంగ బెంగగా నన్ను చూస్తోంది. నాకు దానిమీద జాలేసింది.

అలా కొంత దూరం వెళ్లేక ఒకచోట కుర్చీలు చూపించి మమ్మల్ని కూర్చోమందామె. బెర్లిన్ వెళ్లే విమానం అక్కడికొస్తుందనీ, ఎక్కించడానికి తనొస్తాననీ, కంగారు పడొద్దనీ చెప్పి వెళ్లిపోయింది.

అంతవరకూ మౌనంగా ఉన్న పాప ఆమె వెళ్లిపోగానే, "తమ్ముడూ, భయపడ్డావా" అనడిగింది బాబుని.

ఔనన్నట్లు తలూపాడు బాబు.

"ప్రయాణాల్లో అలా భయపడకూడదు. నేను చూడు, ఆమె చెయ్యి పట్టుకుని ఎలా నడిచానో!" అంది పాప గొప్పగా.

బాబు అక్కకేసి ఆరాధనాపూర్వకంగా చూశాడు.

నేనొకసారి ఇద్దర్నీ దగ్గరగా తీసుకుని, ఓ సారి చుట్టూ చూస్తే – మా ఫ్లయిట్ నంబరు, వచ్చే టైము అన్నీ స్క్రోల్ ఔతూ కనిపించాయి.

నాకు తెలిసిన వివరాలు కనబడేసరికి ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది. ఇక ఆ అమ్మాయి రాకపోయినా నేనే విమానం ఎక్కెయ్యగలననుకున్నాను.

నా మనసులోని మాట టెలిపతీ ద్వారా తెలుసుకుందో, లేక మళ్లీ ఇంగ్లీషు మాట్లాడాల్సొస్తుందని భయపడిందో ఏమో కానీ – ఆమె మళ్లీ రాలేదు.

విమానం వచ్చేక పిల్లల్ని తీసుకుని హడావుడి పడకుండా తాపీగా విమానం ఎక్కేశాను. స్వానుభవాన్ని మించిన పాఠం లేదు కదా – ఢిల్లీలో విమానం ఎక్కిన అనుభవం నాకే కాదు – పిల్లలకూ బాగా ఉపయోగపడింది.

ఒకసారి విమానంలో కూర్చున్నాక తేలికగా నిట్టూర్చాను.

నా కష్టాలన్నీ ఐపోయాయి. బెర్లిన్లో విమానం దిగగానే మీరొచ్చి నన్నూ పిల్లల్నీ పువ్వుల్లో పెట్టి ఇంటికి తీసుకెడతారనుకున్నాను. ఆ మాటే పాపతో అంటే –

"మనని తీసుకెళ్లడానికి ఎన్ని పూలు కావాలమ్మా!" అనడిగింది పాప.

"పూలంటే నిజంగా పూలు కాదు. జర్మనీలో రోడ్లు మన రోడ్లలా కాదు. వాటిమీద కార్లో వెడుతుంటే పూలమీద నడుస్తున్నట్లు మెత్తగా ఉంటుంది" అన్నాను.

పిల్లల కళ్లు పెద్దవయ్యాయి. వాళ్లప్పుడు మిమ్మల్నికంటే ఎక్కువగా ఆ రోడ్లను చూడాలని తహతహలాడారు.

తీరా విమానం బెర్లిన్ చేరుకుని మేమక్కడ దిగేసరికి – మీరు కనబడలేదు. మా సామాను మేమే తీసుకుని బయటకు వెళ్లాలని అర్థమైంది.

సామాను ఎలా వచ్చిందో, ఎలా తీసుకుంటానో అని నాకు ఆదుర్దా. అక్కడి ఆ పద్ధతులన్నీ పిల్లలకేమో చాలా ఎక్సయిటింగ్‌గా ఉన్నాయి.

వాళ్లు ఏవేవో ప్రశ్నలేస్తుంటే అన్యమనస్కంగా బదులిస్తూ – మొత్తంమీద సామాను తీసుకున్నాను. అన్నీ బాగానే వచ్చేయని చూసుకున్నాక, ఓ ట్రాలీమీద సామాను పెట్టుకుని విమానాశ్రయంలోంచి బయటికొచ్చాను. మీరు ఎక్కడున్నారా అని చూస్తుంటే – నాకు కాస్త దూరంగా నన్నే గుచ్చి గుచ్చి చూస్తున్న ఓ వ్యక్తి కనిపించాడు.

చూడ్డానికి ఇండియన్ లాగే ఉన్నాడు. ఎత్తు మీ అంతే ఉన్నాడు. కానీ అతడి పిల్లి గెడ్డం చూస్తే భయమేసింది. ఆపైన అతడు తన చేతిలో ఫొటోలాంటిది పెట్టుకుని ఆ ఫొటోనీ, నన్నూ మార్చి మార్చి చూస్తున్నాడు. కిడ్నాపర్ కాదు కదా అని భయమేసింది. ఈ దేశాల్లో అలాంటివి మామూలని నాకో అభిప్రాయముంది. అందుకని అతగాడు మావద్దకొచ్చేలోగా – మీరు వచ్చేస్తే బాగుణ్ణని దేవుడికి దణ్ణాలమీద దణ్ణాలు పెట్టేసుకుంటున్నాను.

మీరు రాలేదు కానీ – చివరికి అతడే నా వద్దకు వచ్చి – "మిసెస్! రాజగోపాలరావ్" అన్నాడు.

నా పై ప్రాణాలు పైనే పోయాయి. నా వివరాలు ముందే తెలుసుకుని వచ్చేడన్న మాట!

నోట మాట రాక తెల్లబోయి చూస్తుంటే – "ఈ ఫొటో నాకు మీవారిచ్చారు" అన్నాడతడు తెలుగులో.

బెర్లిన్ విమానాశ్రయంలో ఒక అపరిచితుడి నోట తెలుగు మాట వినిపించడం ఊహించని విశేషం.

అప్రయత్నంగా చేయి జాపి ఆ ఫొటో అందుకున్నాను. అది జర్మనీ వెళ్లేముందు కూడా మీరు తీసుకెళ్లిన మన ఫామిలీ ఫొటో. కానీ –

వస్తానన్న మనిషి రాకుండా ఇలా ఫొటో పంపడమేమిటి? ఎప్పుడెప్పుడు మమ్మల్ని చూస్తానా అని తహతహలాడాల్సిన మనిషి తాపీగా ఇంట్లో కూర్చుని ఎవర్నో పంపిస్తారా?

నాలో రకరకాల అనుమానాలు. ఆ ఫొటో మీరిచ్చారా లేక అతగాడు సంపాదించాడా?

నాకు అతడిమీద చాలా అనుమానంగా ఉంది. అందులోనూ అతడి తెలుగు – తెలుగువాడి తెలుగులా లేదు. స్పష్టంగానే ఉన్నా – ఏదో యాస.

నేను మాట్లాడకపోగా అతడే మళ్లీ – "మీవారుండేది పశ్చిమ బెర్లిన్. ఇది తూర్పు బెర్లిన్. ప్రస్తుతం మీరు తూర్పు జర్మనీలో ఉన్నారు. ఇక్కడికి రావడానికి మీవారికి అనుమతి దొరకలేదు. నాకు అనుమతి ఉంది కాబట్టి – మిమ్మల్ని తీసుకు రమ్మని నన్ను పంపారు. నమ్మకానికి ఈ ఫొటోతో పాటు ఓ ఉత్తరం కూడా ఇచ్చారు" అంటూ నాకో ఉత్తరం అందించాడు.

ఆ ఉత్తరంలో మీ దస్తూరీ చూడగానే మిమ్మల్నే చూసినట్లనిపించింది. అందులో మీరు వ్రాసినవి చదువుతుంటే మీరు మాట్లాడినట్లే అనిపించింది. అతడు చెప్పిన వివరాలే ఆ ఉత్తరంలో ఉన్నాయి. ఐనా ఆ అపరిచితుణ్ణి చూస్తుంటే మీరు పంపిన మనిషిలా అనిపించలేదు. అతడితో కలిసి ప్రయాణం చెయ్యాలంటే ఎందుకో నాకు భయమేసింది.

అక్కణ్ణించి పశ్చిమ బెర్లిన్ వెళ్లడానికి బస్సొకటుంది. మేమందులో ఎక్కడానికి అపరిచితుడు సాయం చేశాడు. అతడి సౌమ్యతవల్ల నాకు బెరుకు కూడా కాస్తతగ్గింది.

మేము సీట్లలో స్థిరంగా కుర్చున్నాక ఆ అపరిచితుడు నాతో, "మీకు ధైర్యంగా ఉంటుందని మీతోపాటు బస్సులో కడదాకా వచ్చి మిమ్మల్ని మీవారితో కలిపి వెడదామనుకున్నాను. కానీ బస్సులో ప్రయాణీకుల్ని తప్ప ఎక్కనివ్వనన్నారు. మీ పరిస్థితి చెప్పి ఎంతో బ్రతిమాలాను. కానీ వీళ్లు నియమాలు చాలా ఖచ్చితంగా పాటిస్తున్నారు. నేను రావడానికి ససేమిరా అన్నారు. రాలేనందుకు అయాం సారీ! కానీ మీకేం భయం లేదు. ఈ ప్రయాణంలో మీ స్టాప్ చిట్టచివరిది. మీరు ఎక్కడా దిగక్కర్లేదు. మీవారొచ్చి మిమ్మల్ని దింపుకుంటారు" అన్నాడు.

అతడి తెలుగులో యాస ఎక్కువున్నా, మాస్కోలో ఇంగ్లీషులా కాక, నాకు చాలా బాగా అర్థమైంది. అతడికి చేతులు జోడించి నమస్కరించి వీడ్కోలు చెప్పాను.

బస్సు నిజంగానే పూలబాటలో వెడుతున్నట్లు వేగంగానూ, ఏమాత్రం కుదుపులు లేకుండానూ జారిపోతోంది.

నేను చివరి స్టాపుకోసం ఎదురు చూస్తున్నాను కానీ డ్రైవర్ మధ్యలోనే ఓ స్టాపులో ఆపి నాతో ఏదో చెబుతున్నాడు.

అతడక్కడ దిగిపొమ్మంటాడేమోనని ఓ భయం. మీరు నన్ను చివరి స్టాపులో కలుసుకుంటానన్నారని ఎలా చెప్పాలా అని బెంగ!

మళ్లీ నా మనసులో కలవరం. ఆ సమయంలో మీరు కనిపించారు........

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments